తెలుగు దినపత్రిక
ప్రభాత
jayabheridaily.com
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 01
సంచిక : 72
పేజీలు : 4
వెల : 4
మల్కాజిగిరి
సోమవారం, 25-09-2023

జయభేరి దినపత్రిక, జయభేరి ఛానల్‌లో
నిఖార్సైన జర్నలిస్టులుగా నిలబడాలనుకుంటున్నారా?
అన్ని తరహా వార్తలు.. కథనాలు...
ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలనుకుంటున్నారా?
మీ కలాలకు పదును పెట్టండి....
విలేకర్లు కావలెను
ఆసక్తి కలిగిన యువతి యువకులకు అవకాశం
అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత
email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com
9391 544 889 call me

# బీజేపీ బిగ్ ప్లాన్
## అక్టోబర్ 1న పాలమూరుకు మోదీ
## నిజామాబాద్‌లోనూ పర్యటన
## ప్రధాని మోదీ తెలంగాణ టూర్



**జయభేరి, హైదరాబాద్ :**
ప్రధాని మోదీ తెలంగాణ పర్యటన ఖరారైంది. అక్టోబర్ 1వ తేదీన మహబూబ్ నగర్ లో తలపెట్టే పార్టీ బహిరంగ సభలో పాల్గొననున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ బీజేపీ అగ్రనాయకత్వం తెలంగాణపై ఫోకస్ పెట్టే పనిలో పడింది. మరికొద్దిరోజుల్లోనే ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో... బిగ్ ప్లాన్ తో ఎన్నికల యుద్ధంలోకి దిగాలని భావిస్తోంది. ఇటీవలే అమిత్ షా హైదరాబాద్ కు రాగా... వచ్చే నెల మొదటివారంలో ప్రధాని మోదీ తెలంగాణకు రానున్నారు. ఇప్పటికే టూర్ షెడ్యూల్ ఖరారైంది. ఇందుకు సంబంధించిన ప్రాథమిక వివరాలను తెలంగాణ బీజేపీ నేతలు వెల్లడించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి, మాజీ ఎంపీ జితేందర్ రెడ్డి, ఆచారి శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రధాని మోదీ టూర్ గురించి తెలిపారు. అక్టోబరు 1న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్రానికి రానున్నారని వెల్లడించారు. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూరు పురపాలికలోని ఐటీఐ మైదానం వేదికగా మధ్యాహ్నం 1 గంటకు జరిగే బహిరంగ సభలో పాల్గొంటారని వివరించారు. ఈ సభ ద్వారా ఆయన రాష్ట్రంలో ఎన్నికల శంఖరావాన్ని పూరిస్తారని జితేందర్ రెడ్డి పేర్కొన్నారు. అంతేకాకుండా... నిజామాబాద్‌లో కూడా ప్రధాని మోదీ పర్యటన ఉండే అవకాశం ఉంది. ఇది అక్టోబరు 3వ తేదీన పర్యటిస్తారని తెలుస్తోంది. అయితే బహిరంగ సభనా లేక రోడ్ షో మాత్రమే ఉంటుందా అనేది తెలియాల్సి ఉంది. నిజామాబాద్ టూర్ పై అధికారికంగా ప్రకటన రావాల్సి ఉంది. నిజానికి ఈ నెల 28, 29 మిగతా 2 లో

# హెచ్ఎండిఏ ఆధ్వర్యంలో
# ఐదు ఫోర్ లైన్ బ్రిడ్జిలు



**జయభేరి, హైదరాబాద్ :**
హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్ మెంట్ అథారిటీ (హెచ్ఎండిఏ) ఆధ్వర్యంలో మూసినది పైన మూడు చోట్ల, ఈసానదిపై రెండు చోట్ల వంతెనల నిర్మాణ పనులకు ముందడుగు పడింది. సుమారు రూ.168 కోట్ల వ్యయంతో ఐదు వంతెనల నిర్మాణ పనులకు హెచ్ఎండిఏ ఇప్పటికే ఇంజనీరింగ్ ప్రోక్యుర్మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) పద్ధతిలో టెండర్ల ప్రక్రియను పూర్తి చేసింది.
హైదరాబాద్ నగర పౌరులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న మూసి, ఈసా నదులపై వంతెనల (బ్రిడ్జిల) నిర్మాణపనులు త్వరలో సాకారం కానున్నాయి. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు లోపల పెరుగుతున్న రద్దీకి అనుగుణంగా ప్రజల అవసరాలకు సరిపడా ప్రజా రవాణా వ్యవస్థలో మున్సిపల్ పరిపాలన పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి కేటీ ఆర్ సారథ్యంలో ఎంఏయుడి స్పెషల్ చీఫ్ సెక్రటరీ, హెచ్ఎండిఏ మెట్రోపాలిటన్ కమిషనర్ అర్వింద్ కుమార్ పర్యవేక్షణలో గణనీయమైన మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా మిగతా 2 లో

# నరకం అనుభవిస్తున్నా
## తండ్రిని తుపాకీతో కాల్చి చంపిన మైనర్



**జయభేరి, పాకిస్థాన్ :**
పాకిస్థాన్‌లో షాకింగ్ ఘటన వెలుగులోకి వచ్చింది. ఓ వ్యక్తి, తన కూతురుపై మూడు నెలలుగా అత్యాచారం చేస్తుండగా, అతడిని ఆమె కాల్చి చంపేసింది. పాకిస్థాన్ పంజాబ్ రాష్ట్రంలోని లాహోర్ గుజ్జార్‌పురా ప్రాంతంలో శనివారం జరిగింది ఈ ఘటన. ఓ వ్యక్తి గత మూడు నెలలుగా తన కూతురిపై అత్యాచారానికి పాల్పడుతున్నాడు. ఆమె వయస్సు 14ఏళ్లు. ఆమె ఒక మైనర్. ఆ బాలిక, తండ్రి వేధింపులను భరించలేకపోయింది. అతడిని చంపేద్దామని నిర్ణయించుకుంది. ఈ క్రమంలో.. తుపాకీతో అతడిని కాల్చిచంపేసింది. ఆ వ్యక్తి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు.. ఘటనాస్థలానికి వెళ్లారు. ఆ వ్యక్తి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించారు. "మూడు నెలలుగా నా మీద అత్యాచారం చేస్తున్నాడు. నరకం మిగతా 2 లో



2 లో

# అంతర్జాతీయ స్థాయి ఆహ్వానం
తెలంగాణ వ్యవసాయ ప్రగతిపై ప్రసంగం

మంత్రి కేటీఆర్ కు మరో అంతర్జాతీయ స్థాయి ఆహ్వానం అందింది. బోర్లాగ్ ఇంటర్నేషన్ డైలాగ్ సమావేశంలో పాల్గొనాలని మంత్రి కేటీఆర్ ను ఆహ్వానించారు. గడిచిన పది సంవత్సరాల్లో తెలంగాణ రాష్ట్రం సాధించిన అద్భుతమైన వ్యవసాయ ప్రగతి ప్రస్థానాన్ని వివరించాలని మంత్రి కేటీఆర్ కు అంతర్జాతీయ స్థాయి ఆహ్వానం అందింది. వ్యవసాయ రంగంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన శాస్త్రవేత్త, ప్రపంచ హరిత విప్లవ పితామహుడు నార్మన్ ఈ బోర్లాగ్ పేరిట ఏర్పాటు చేసిన బోర్లాగ్ ఇంటర్నేషనల్ డైలాగ్ సమావేశంలో మంత్రి కేటీఆర్ ను ప్రసంగించాలని నిర్వాహకులు ఆహ్వానం పంపారు. అక్టోబర్ 24 నుంచి 26వ తేదీ వరకు అమెరికాలోని ఐయోవా రాష్ట్రంలోని డేస్మోయిన్ లో ఈ సమావేశం జరుగనుంది.

# ఈ ఫైల్ లోని 13 సంతకాలు మీరే చేశారా?

ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ స్కీమ్ స్కామ్ కేసులో అరెస్టైన మాజీ సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడిని కస్టడీలోకి తీసుకొని ప్రశ్నించనుంది ఏపీ సీఐడీ. తొలిరోజు రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ... మొత్తం 6 గంటలపాటూ ప్రశ్నించారు సీఐడీ అధికారులు. మధ్యలో 1 గంట భోజనానికి కేటాయించారు. ఈ విచారణ జరిగినప్పుడు చంద్రబాబు తరపు లాయరం దమ్మాలపాటి శ్రీనివాస్ అక్కడే ఉన్నారు. విచారణలో మొత్తం 12మంది సీఐడీ అధికారులు పాల్గొన్నారు. ఈ స్కాంలో మొత్తం రూ.371కోట్ల కుంభకోణం జరిగిందనీ... అందులో GST తీసేయగా.. రూ.301 కోట్లు మనీ ఉంటుందనీ.. అందులో 60 కోట్ల రూపాయలు నిజంగానే స్కిల్ డెవలప్‌మెంట్ కోసం ఖర్చు చెయ్యగా... మిగతా రూ.241 కోట్లకు సంబంధించి లెక్క తేలాల్సి ఉందని అధికారులు చంద్రబాబుకి చెప్పినట్లు తెలిసింది. మొత్తం ప్రాజెక్టు విలువ ఎంత? ఈ ప్రాజెక్టు విలువ గుజరాత్ కంటే ఏపీలో ఎక్కువగా ఎందుకు ఉంది? కాంట్రాక్ట్‌ను ఏ ప్రాతిపదికన ఇచ్చారు? సబ్ కాంట్రాక్టులను ఎలా ఇచ్చారు? నిధుల విడుదలకు ఆర్థిక శాఖపై ఒత్తిడి తెచ్చారా? ఈ ఫైల్ లోని 13 సంతకాలు మీరే చేశారా? 2018లో కేంద్ర ఆదాయ పన్ను శాఖ, స్కిల్ డెవలప్‌మెంట్ స్కీంలో లోపాలు ఉన్నాయని మీకు లేఖ రాసిందా? ఆ లేఖను మీరు ఎందుకు పట్టించుకోలేదు? సీమెన్స్‌తో మీకు సంబంధం ఉందా? ముందుగా జారీ చేసిన జీవోకీ, సీమెన్స్‌తో చేసుకున్న ఒప్పందానికీ మధ్య తేడా ఎందుకుంది? వంటి ప్రశ్నలను అడిగినట్లు తెలిసింది. ఆయా ప్రశ్నలకు చంద్రబాబు చెప్పే సమాధానాల ఆధారంగా సీఐడీ అధికారులు మరిన్ని ప్రశ్నలు వరుసగా వేసినట్లు తెలిసింది. చంద్రబాబు చెప్పిన సమాధానాలను బట్టి.. మధ్యమధ్యలో అధికారులు.. తాము విడిది చేసిన R&B ఆఫీస్ నుంచి కొన్ని ఆధార పత్రాలను కూడా తెప్పించుకున్నారని సమాచారం. చంద్రబాబు చెప్పిన సమాధానాలను బట్టి... అధికారులు కొత్త ప్రశ్నావళిని సిద్ధం చేసుకున్నట్లు తెలిసింది. ఈ ప్రశ్నలకు వచ్చే సమాధానాలను బట్టీ.. ఆయన్ని మరిన్ని రోజులు కస్టడీ లోకి తీసుకోవాలా లేక, ఇక్కడితో విచారణ సరిపోతుందా... మరిన్ని రోజులు ప్రశ్నించాలి అనుకుంటే, మళ్లీ కస్టడీకి ఇవ్వాలని ఏసీబీ కోర్టును కోరే ఛాన్స్ ఉంటుంది. సోమవారం ఆయన్ని సీఐడీ అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జడ్జి ముందు ప్రవేశపెడతారు. రిమాండ్ పొడిగించాలా వద్దా అనే దానిపై జడ్జి నిర్ణయం తీసుకుంటారు. చంద్రబాబు బెయిల్ కోసం దాఖలైన పిటిషన్లను కోర్టు సోమవారం విచారించనుంది.





# ఒకే రోజు 9 వందే భారత్ రైళ్లు ప్రారంభం
## రైల్వే శాఖలో నవశకానికి మోదీ శ్రీకారం- కిషన్ రెడ్డి

**జయభేరి, హైదరాబాద్ :**
ఏకకాలంలో 9 వందే భారత్ రైళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్ కాచిగూడ రైల్వే స్టేషన్ లో కాచిగూడ - యశ్వంత్ పూర్ వందే భారత్ రైలును ప్రధాని మోడీ వర్చువల్ గా పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. నరేంద్ర మోదీ ప్రధాని అయిన తరువాత భారత రైల్వే వ్యవస్థలో ఒక నూతనశకం ప్రారంభం అయ్యిందన్నారు. ఒక నూతన అధ్యాయానికి నరేంద్ర మోదీ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఆయన కొనియాడారు. దేశంలో అన్ని రైల్వే స్టేషన్లను ఆధునీకరణ చెయ్యాలని, అన్ని రైల్వే స్టేషన్లలో ప్ర పాకిస్థాన్ యాణికులకు ఆధునిక వసుతులు కల్పించాలనేదే మోదీ ఆలోచనా అన్నారు. అందుకే వేలాది కోట్ల రూపాయలు రైల్వే వ్యవస్థ అభివృద్ధికి కేటాయిస్తున్నారని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. స్వదేశంలోనే అభివృద్ధి చేసిన అత్యంత ఆధునిక వసతులతో 9 వందే భారత్ రైళ్లను ఏకకాలంలో ప్రారంభించిన ఘనత నరేంద్ర మోదీకి దక్కుతుందన్నారు. తెలంగాణలో ప్రస్తుతం రెండు వందే భారత్ రైళ్లు నడుస్తున్నాయని, ఈరోజు ప్రారంభించే దానితో కలిపి తెలంగాణలో మూడు వందే భారత్ రైళ్లు నడుస్తున్నాయన్నారు. ఇందకు ప్రధాని మోదీ హృదయపూర్వక ధన్యవాదాలు చెప్పుకుంటున్నానన్నారు. రెండు మిగతా 2 లో

# తానే అభ్యర్థినని ప్రకటించుకున్న పట్నం
## బీఆర్ఎస్ అధిష్టానం సీరియస్.. ప్రగతి భవన్ కు పిలిచి క్లాస్!



**జయభేరి, హైదరాబాద్ :**
బీఆర్ఎస్ అధిష్టానం నిర్ణయానికి వ్యతిరేకంగా మాట్లాడినందుకు డీసీసీబీ వైస్ ఛైర్మన్ పట్నం మాణిక్యంపై అధినాయకత్వం సీరియస్ అయింది. సీఎం కేసీఆర్.. మాజీ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ను సంగారెడ్డి అభ్యర్థిగా ప్రకటించినప్పటికీ, నిన్న తన పుట్టినరోజు వేడుకల్లో పట్నం మాణిక్యం.. సంగారెడ్డి ప్రజల్ని ఉద్దేశించి మాట్లాడుతూ తానే బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీలో ఉంటానని ప్రకటించుకున్నారు. పట్నం వ్యాఖ్యలను అధిష్ఠానం సీరియస్ గా తీసుకుంది. పుట్టినరోజు మరునాడే మాణిక్యంకు ప్రగతి భవన్ నుంచి పిలుపువచ్చింది. మంత్రి హరీశ్ రావు మాణిక్యంతో మాట్లాడి తీవ్రంగా హెచ్చరించినట్టు తెలుస్తోంది. మంత్రి సుమారుగా గంటసేపు మాణిక్యంతో మాట్లాడినట్టు సమాచారం. ఎన్నికల ముందు పార్టీని బలహీన పరిచే విధంగా ఎవరు ప్రవర్తించినా సహించేది లేదని హరీశ్ రావు తేల్చి చెప్పినట్లు పార్టీ వర్గాలు అంటున్నాయి. అందరూ కలిసికట్టుగా చింతా ప్రభాకర్ విజయం కోసం పనిచేయాలని కేసీఆర్ ను మూడోసారి ముఖ్యమంత్రిగా చేసే వరకు అందరూ కలిసికట్టుగా ఉండాలని మంత్రి హరీశ్ రావు అన్నట్టు తెలుస్తుంది. బీఆర్ఎస్ గవర్నమెంట్ వచ్చిన తర్వాత, పార్టీ విజయం కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం మిగతా 2 లో

ప్రభాత జయభేరి
jayabheridaily.com

▶▶ మొదటిపేజీ తరువాయి

## అక్టోబర్ 1న పాలమూరుకు మోదీ

తేదీల్లో ప్రధాని మోదీ తెలంగాణ పర్యటన ఉంటుందని భావించారు. కానీ చివరికి అక్టోబరు 1న ఖరారు చేసినప్పటికీ... షెడ్యూల్ లో స్వల్ప మార్పులు చేస్తూ... 1వ తేదీన మహబూబ్ నగర్ సభలో పాల్గొననున్నారు ప్రధాని మోదీ. ఇక ప్రధాని బహిరంగ సభను విజయవంతం చేసే దిశగా రాష్ట్ర నాయకత్వం కార్యాచరణను సిద్ధం చేసుకునే పనిలో ఉంది. లక్ష మందికి పైగా సభకు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. నియోజకవర్గానికి 20 వేల మందికి తగ్గకుండా తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. త్వరలోనే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు నగారా మోగనుంది. అధికార బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటించగా.... కాంగ్రెస్ కూడా త్వరలోనే జాబితాను ప్రకటించే అవకాశం ఉంది. ఇప్పటికే సీడబ్ల్యూసీ భేటీతో పాటు విజయభేరి సభను నిర్వహించింది కాంగ్రెస్. గ్యారెంటీ కార్డుతో జనాల్లోకి వెళ్తోంది. ప్రధాని మోదీ సభ తర్వాత బీజేపీ కూడా అభ్యర్థుల జాబితాను వెల్లడించే ఛాన్స్ ఉంది. ప్రధాని మోదీ సభ ద్వారా ఎన్నికల శంఖారావాన్ని పూరించాలని బీజేపీ తెలంగాణ నేతలు భావిస్తున్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలే టార్గెట్ గా ప్రధాని మోదీ ప్రసంగం ఉండే అవకాశం ఉంది.

## 9 వందే భారత్ రైళ్లు ప్రారంభం

తెలుగు రాష్ట్రాల నుంచి హైదరాబాద్ (కాచిగూడ) (యశ్వంత్ పూర్) బెంగళూరు, విజయవాడ చెన్నై రైళ్లు ఉండగా వీటితోపాటు జైపూర్‌ఉదయ్‌పూర్, పాట్నాహౌరా, రాంచీహౌరా, చెన్నైతిరునెల్వెలి, పూరీరూర్కెలా, కాసర్‌గోడ్‌తిరువనంతపురం, జమ్మునగర్‌అహ్మదాబాద్ మధ్య వందేభారత్ రైళ్లను ప్రారంభించనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

**హైదరాబాద్, బెంగళూరు రైలు ప్రత్యేకతలు**

హైదరాబాద్‌బెంగళూరు వందేభారత్ రైలు ఏపీ మీదుగా కర్ణాటకకు వెళ్లనుంది. కాచిగూడయశ్వంత్‌పూర్ వందే భారత్ రైలులో మొత్తం 8 కోచ్‌లు ఉంటాయి. రైలులో 530 మంది ప్రయాణించేందుకు సీట్లు ఉంటాయి. ఒక ప్రయాణికుడికి క్యాటరింగ్ ఛార్జీలతో కలిపి ఏసీ చైర్‌కార్ ధర రూ.1,600గా, ఎగ్జిక్యూటివ్ టికెట్ ధర రూ.2,915గా ఉండనుంది. క్యాటరింగ్ వద్దనుకుంటే ఏసీ చైర్ కార్ టికెట్ రూ.1,255, ఎగ్జిక్యూటివ్ టికెట్ రూ.2,515గా ఉండనుంది. ఈ రెండు నగరాల మధ్య దూరం 610 కి.మీ దూరం కాగా ప్రయాణానికి 8.30 గంటల సమయం పడుతుంది. కాచిగూడయశ్వంత్‌పూర్ వందే భారత్ రూటులో మొత్తం నాలుగు స్టేషన్లలో ఆగుతుంది. కాచిగూడలో ఉదయం 5.30కి ట్రైన్ బయల్దేరగా మహబూబ్ నగర్ 6.49 గంటలకు, కర్నూలు 8.24 గంటలకు, అనంతపురం 10.44 గంటలకు, ధర్మవరం 11.14 గంటలకు, యశ్వంత్‌పూర్‌కు మధ్యాహ్నం 2 గంటలకు చేరుకుంటుంది. ఒక్క బుధవారం మినహా వారంలో మిగతా రోజులు ఈ వందే భారత్ రైళ్ల సేవలు అందుబాటులో ఉంటాయి.


## తానే అభ్యర్థినని..

కల్పిస్తామని హామీ ఇచ్చారు. సెప్టెంబర్ 22న తన 60వ పుట్టినరోజును ఘనంగా జరుపుకున్న మాణిక్యం, సంగారెడ్డి పట్టణంలో పెద్ద ర్యాలీ కూడా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో తానే బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో ఉండబోతున్నానని, తనకు మద్దతు ఇచ్చి గెలిపించాలని ప్రజలను కోరారు. పట్నం ప్రకటనతో బీఆర్ఎస్ లో గందరగోళం నెలకొంది. అయితే చింతా ప్రభాకర్ పైన, పార్టీ నాయకత్వానికి వ్యతిరేకంగా పట్నం ఎటువంటి వ్యాఖ్యలు చేయకపోయినా, తనను తానే అభ్యర్థిగా ప్రకటించుకోవడాన్ని పార్టీ నాయకత్వం సీరియస్ గా తీసుకుంది. ఇలాంటి వ్యాఖ్యలు పార్టీ కేడర్ లో గందరగోళం సృష్టిస్తున్నాయని పార్టీ భావించినట్టు తెలుస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో సంగారెడ్డి జిల్లా పార్టీ బాధ్యుడైన మంత్రి హరీశ్ రావు, త్వరలోనే నియోజకవర్గంలోని కీలక నేతలతో భేటీ కానున్నట్టు తెలుస్తోంది. బీఆర్ఎస్ నేతలతో మీటింగ్ పెట్టి అందరూ కలిసి పనిచేయాలని దిశానిర్దేశం చేయనున్నారని పార్టీ నాయకులు తెలిపారు. బీఆర్ఎస్ కు సంగారెడ్డిలో జగ్గారెడ్డి రూపంలో గట్టి ప్రత్యర్థి పోటీలో ఉండటంతో... కాంగ్రెస్ కు ఎటువంటి అవకాశం ఇవ్వకుండా పనిచేయాలని మంత్రి బీఆర్ఎస్ నేతలను ఉద్దేశించి మాట్లాడనున్నారు.

## హెచ్ఎండిఏ ఆధ్వర్యంలో ఐదు ఫోర్ లైన్ బ్రిడ్జిలు

మూసీనదిపైన, ఈసానదిపైన వంతెనల నిర్మాణానికి అవసరమైన చర్యలు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. మూసి, ఈసా నదులపై 14 బ్రిడ్జిలు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కరోనా (కోవిడ్) వల్ల రెండు సంవత్సరాల పాటు ఎదురైన పరిస్థితుల కారణంగా మూసి, ఈసా నదులపై వంతెనల నిర్మాణ కార్యాచరణలో జాప్యం చోటుచేసుకుంది. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్ మెంట్ అథారిటీ (హెచ్ఎండిఏ) ఆధ్వర్యంలో మూసినదిపైన మూడు చోట్ల, ఈసానదిపై రెండు చోట్ల వంతెనల నిర్మాణ పనులకు ముందడుగు పడింది. సుమారు రూ.168 కోట్ల వ్యయంతో ఐదు వంతెనల నిర్మాణ పనులకు హెచ్ఎండిఏ ఇప్పటికే ఇంజనీరింగ్ ప్రోక్యుర్మెంట్ అండ్ కన్ స్ట్రక్షన్ (ఈపీసీ) పద్ధతిలో టెండర్ల ప్రక్రియను పూర్తి చేసింది. ఉప్పల్ భగాయత్, ప్రతాపసింగారం ప్రాంతాల్లో సుమారు 210 మీటర్ల పొడవున మూసిపై నాలుగు వరుసల (ఫోర్ లైన్) వంతెన నిర్మాణం జరుగనున్నది. టెండర్ ప్రక్రియ పూర్తి అయినందున మంత్రి కేటీఆర్ సోమవారం (25వ తేదీన) శంకుస్థాపన చేయనున్నారు. ఐదు వంతెన నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. వంతెనల నిర్మాణ పనులను 15 నెలల గడువులోగా పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

## తొలిపూజలు అందుకునే ఆదిదేవుడు గణనాధుడు



**జయభేరి, మేడిపల్లి :**

ప్రతి శుభాకార్యంలోను తొలిపూజలు అందుకునే ఆదిదేవుడు గణనాధుడు అని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి తెలిపారు. గణేష్ నవరాత్రుల సందర్భంగా బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 7వ డివిజన్ లో కొలువుదీరిన వినాయక మండపాన్ని ఆదివారం మంత్రి, నీటి వనరుల అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రకాశ్ దంపతులు, నగర మేయర్ సామల బుచ్చిరెడ్డి, స్థానిక కార్పోరేటర్ కాటపల్లి లతా రాంచంద్రారెడ్డి లతో కలిసి సందర్శించి ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. పూజల అనంతరం మంత్రి, చైర్మన్ లకు నిర్వహకులు శాలువాలతో సత్కరించారు. వారు మాట్లాడుతూ... దేశంలోనే హైదరాబాద్‌లో నిర్వహించే గణేష్ ఉత్సవాలకు ఎంతో ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఆదేశాల మేరకు ప్రభుత్వం అన్ని పండుగలు, ఉత్సవాల నిర్వహణ కోసం అవసరమైన ఏర్పాట్లను చేస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. ప్రజలు సంతోషంగా ఉండాలి. పండుగలను గొప్పగా నిర్వహించుకుంటున్నామని తెలిపారు .ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి, కార్పోరేటర్లు, నాయకులు కాలనీవాసులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ స్థాయి ఆహ్వానం

**జయభేరి, హైదరాబాద్ :**

మంత్రి కేటీఆర్ కు మరో అంతర్జాతీయ స్థాయి ఆహ్వానం అందింది. బోర్లాగ్ ఇంటర్నేషన్ డైలాగ్ సమావేశంలో పాల్గొనాలని మంత్రి కేటీఆర్ ను ఆహ్వానించారు. గడిచిన పది సంవత్సరాల్లో తెలంగాణ రాష్ట్రం సాధించిన అద్భుతమైన వ్యవసాయ ప్రగతి ప్రస్థానాన్ని వివరించాలని మంత్రి కేటీఆర్ కు అంతర్జాతీయ స్థాయి ఆహ్వానం అందింది. వ్యవసాయ రంగంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన శాస్త్రవేత్త, ప్రపంచ హరిత విప్లవ పితామహుడు నార్మన్ ఈ బోర్లాగ్ పేరిట ఏర్పాటు చేసిన బోర్లాగ్ ఇంటర్నేషనల్ డైలాగ్ సమావేశంలో మంత్రి కేటీఆర్ ను ప్రసంగించాలని నిర్వాహకులు ఆహ్వానం పంపారు. అక్టోబర్ 24 నుంచి 26వ తేదీ వరకు అమెరికాలోని ఐయోవా రాష్ట్రంలోని డేస్మోయిన్ లో ఈ సమావేశం జరుగనుంది. ఈ ఏడాది జరుగనున్న బోర్లాగ్ డైలాగ్ సమావేశంలో "స్థిరమైన, సమానమైన, పోషకమైన ఆహార వ్యవస్థను సాధించడానికి పరివర్తన పరిష్కారాలు "అనే ప్రధాన అంశం ఆధారంగా చర్చలు కొనసాగనున్నాయి. ప్రపంచ దేశాలకు చెందిన 1200 మంది అతిథులు ఈ సమావేశానికి నేరుగా హాజరవుతారు. దీంతో పాటు వేలాది మంది సామాజిక మాధ్యమాల ద్వారా ఈ సమావేశాల్లో పాల్గొంటారు. వ్యవసాయ రంగంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేందుకు అవసరమైన విస్తృతస్థాయి చర్చలను ప్రతి ఏటా ఈ సమావేశాల్లో చర్చిస్తారు. తెలంగాణ రాష్ట్ర అనుభవాలను ఈ సమావేశంలో చర్చించడం వల్ల ప్రపంచ వ్యాప్తంగా ఈ సమావేశాలకు హాజరవుతున్న అనేక మందికి ఎంతో ఉపయోగంగా ఉంటుందని మంత్రి కేటీఆర్ కు పంపిన ఆహ్వానంలో వరల్డ్ ఫుడ్ ప్రైజ్ ఫౌండేషన్ అధ్యక్షుడు టెర్రి ఈ బ్రాడ్ స్టాడ్ తెలిపారు. తెలంగాణ సాధించిన వ్యవసాయ ప్రగతి కోసం రాష్ట్రం అనుసరించిన విధానాలు ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించడంతో ప్రపంచ ఆహార భద్రతను, సరఫరాను పెంచడం, ప్రపంచ ఆహార కొరతను ఎదుర్కోవడం వంటి కీలకమైన అంశాల పట్ల ఒక విస్తృతమైన అవగాహన ఏర్పడుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రగతిని వివరించాలని మంత్రి కేటీఆర్ కు పంపుతున్న ఆహ్వానం... ఈ సమావేశానికి గౌరవాన్ని అందిస్తుందని టెర్రీ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రగతిని ముఖ్యంగా వ్యవసాయ రంగ ప్రగతిని గుర్తించి ఈ అంశం పైన ప్రసంగించాల్సిందిగా వరల్డ్ ఫుడ్ ప్రైజ్ ఫౌండేషన్ పంపిన ఆహ్వానం పట్ల మంత్రి కేటీఆర్ సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో గత పది సంవత్సరాలలో వ్యవసాయ రంగ అభివృద్ధి కోసం ఎన్నో వినూత్నమైన, విప్లవాత్మకమైన కార్యక్రమాలను అనుసరించిందని వాటి ప్రతిఫలాలను ఈరోజు తెలంగాణ రైతాంగం అందుకుంటుందని, ఆహార భద్రత అంశంలో దేశానికి కూడా తెలంగాణ భరోసాగా నిలుస్తుందన్నారు. ఇంతటి విజయవంతమైన తెలంగాణ వ్యవసాయ నమూనాను అంతర్జాతీయ వేదిక పైన వివరించాలని వచ్చిన ఆహ్వానం తెలంగాణ విధానాలకు దక్కిన గౌరవంగా ఆయన అభివర్ణించారు. మంత్రి కేటీఆర్ తో పాటు వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డికి కూడా ఈ సంస్థ ఆహ్వానం అందించింది.

▶▶ మొదటిపేజీ తరువాయి

## నరకం అనుభవిస్తున్నా

అనుభవిస్తున్నాను. నా రేపిస్ట్ తండ్రిని చంపేశాను. తుపాకీతో కాల్చి చంపేశాను," అని ఆ బాలిక.. పోలీసులకు చెప్పింది. అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేపట్టిన అనంతరం ఈ ఘటనపై కేసు నమోదు చేస్తామని పోలీసులు వెల్లడించారు. మరో కేసులో.. మైనర్ కూతురిని రేప్ చేసిన కారణంతో ఓ వ్యక్తికి పాకిస్థాన్ కోర్టు శుక్రవారం ఉరిశిక్ష విధించింది. ఈ తీర్పు వెలువడిన ఒక రోజు తర్వాతే.. గుజ్జార్ పురాలో ఆ బాలిక, తన తండ్రిని తుపాకీతో చంపేసింది.

**కుటుంబసభ్యుల ముందే.. ముగ్గురు మహిళలపై సామూహిక అత్యాచారం**

పాకిస్థాన్‌లోనే కాదు.. మహిళలు, బాలికలపై అత్యాచారానికి సంబంధించిన ఘటనలు ఇండియాలో కూడా ఎక్కువగానే వార్తల్లో నిలుస్తున్నాయి. హరియాణాలో అత్యంత దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. నలుగురు దండగులు.. ముగ్గురు మహిళపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. కుటుంబ సభ్యుల ముందే.. మహిళలను రేప్ చేశారు. హరియాణాలోని పానిపట్ లో బధవారం అర్ధరాత్రి సమయంలో ఈ ఘటన జరిగింది. నలుగురు సభ్యుల గ్యాంగ్ ఒకటి.. ఓ ఇంట్లోకి చొరబడింది. కుటుంబంలో కొందరి కాళ్లు, చేతులను తాళ్లతో కట్టేశారు దుండగులు. అనంతరం వారి ఎదురుగానే.. ముగ్గురు మహిళలపై సామూహిక అత్యాచారానికి ఒడిగట్టారు. ఆ తర్వాత.. దుండగులు ఈ ఇంట్లో నుంచి డబ్బులు, నగలను దొంగలించి అక్కడి నుంచి పారిపోయారు. ఈ ఘటన జరిగిన కొద్ది సేపటి తర్వాత, కొన్ని కిలోమీటర్ల దూరంలో మరో సంఘటన వెలుగులోకి వచ్చింది. కొందరు దుండగులు.. ఓ ఇంట్లోకి చొరబడ్డారు. అనారోగంతో బాధపడుతున్న మహిళను దారుణంగా కొట్టారు. ఆమె భర్తపైనా దాడి చేశారు. అనంతరం.. ఈ ఇంట్లో నుంచి విలువైన వస్తువులు, మొబైల్ ఫోన్ తీసుకుని అక్కడి నుంచి పారిపోయారు. ఈ ఘటనలో బాధిత మహిళ ప్రాణాలు కోల్పోయింది. ఈ రెండు ఘటనల విషయం పోలీసుల దృష్టికి వెళ్లింది. ఈ రెండింటికీ ఒకటే గ్యాంగ్ కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. రెండు ఘటనలు ఒకే గ్రామంలో జరిగాయి. దర్యాప్తు చేపట్టాము. ఇంకా ఎవరిని అరెస్ట్ చేయలేదు. కానీ ఈ రెండింటికీ ఒకటే ముఠా కారణమని భావిస్తున్నాము. నిందితులను తొందరలోనే పట్టుకుని బాధిత కుటుంబాలకు న్యాయం చేస్తాము," అని మట్లౌడా పోలీస్ స్టేషన్ అధికారులు వెల్లడించారు.

**పెళ్లి చేసుకుంటానని..**

దేశంలో మహిళలపై నేరాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. పెళ్లి చేసుకుంటానని మోసం చేసి, ఓ పోలీస్ హెడ్ కానిస్టేబుల్, ఓ మహిళతో శారీరక సంబంధాన్ని పెట్టుకున్న ఘటన దిల్లీలో చోటుచేసుకుంది. బాధితురాలు.. సదరు వ్యక్తిపై రేప్ కేసు పెట్టింది. 22ఏళ్ల బాధితురాలు.. మూడేళ్ల క్రితం లక్ష్మణ్ నగర్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సి వచ్చింది. అక్కడే.. నఫీస్ అహ్మెద్ అనే హెడ్ కానిస్టేబుల్‌తో పరిచయం అయ్యింది. కొంతకాలానికే వారిద్దరు ఫ్రెండ్స్ అయ్యారు. 2021లో అహ్మెద్.. ఆమెకు ప్రొపోజ్ చేశాడు. పెళ్లి చేసుకుంటానని చెప్పి లొంగదీసుకున్నాడు. ఇలా కొంత కాలం గడిచింది. నఫీస్ అహ్మెద్‌కు పీసీఆర్‌లో పోస్టింగ్ వచ్చింది. అప్పటి నుంచి మహిళతో మాట్లాడటం తగ్గించాడు. ఇది గమనించిన మహిళ.. అతడిని నిలదీసింది. వివాహం చేసుకోనని తేల్చిచెప్పాడు. అతడి గురించి ఆరా తీయగా.. కానిస్టేబుల్‌కు అప్పటికే పెళ్లి అయ్యిందని, నలుగురు పిల్లలు ఉన్నారని తెలుసుకుని షాక్ అయ్యింది. ఈ నేపథ్యంలో.. నిందితుడిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది బాధితురాలు. ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు వెల్లడించారు.

# నేను కౌలు రైతునే.. మాట్లాడుతాను

- రైతు బాధ రైతుకే తెలుసు
- రైతే వ్యవసాయ మంత్రి అవ్వాలి
- ఈ సత్కారం రైతులకు కాదు భగవంతులకు
- వ్యవసాయంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి.. మాజీ సిబిఐ జెడి లక్ష్మినారాయణ
- యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ఆధ్వర్యంలో అన్నదాతలకు ఆత్మీయ సత్కారం



**హైదరాబాద్, 24 సెప్టెంబర్ :**

వ్యవసాయాన్ని కాపాడాలి, అన్నదాతకు ఆసరాగా ఉండాలనే ఆలోచనతో యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. వ్యవసాయమే జీవితంగా జీవనం సాగిస్తూ, వ్యవసాయంలో కొత్త మార్పులకు నాంది పలుకుతున్న ఇరవై మంది యువ రైతులను, వృద్ధ రైతులను, మహిళ రైతులను గుర్తించి వారికి అన్నదాతలకు ఆత్మీయ సత్కారం కార్యక్రమాన్ని అదివారం హైదరాబాద్ బేగంపేటలోని హరిత ప్లాజాలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ఫౌండర్ రాజేంద్ర పల్నాటి అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ప్రధాన సలహాదారులు, మాజీ సిబిఐ జెడీ లక్ష్మినారాయణ, గౌరవ అతిథులుగా ఆర్టీఐ మాజీ కమిషనర్ డా. వర్రె వెంకటేశ్వర్లు, డా. జయశంకర్ వ్యవసాయ యూనివర్శిటి మాజీ విసీ ప్రవీణ్ రావు, రిటైర్డ్ అగ్రికల్చర్ కమిషనర్ అశోక్ కుమార్ హజరయ్యారు.

**మాజీ సిబిఐ జెడి లక్ష్మినారాయణ**


కొవిడ్ కాలంలో దేశాన్ని ముందుకు తీసుకెళ్లింది రైతులే అన్ని రంగాలు వెనక్కి వెళుతుంటే ముందుకు వెళ్లింది వ్యవసాయ రంగం మాత్రమే. ప్రధానమంత్రి గర్వంగా మేము ప్రపంచంలో 70 దేశాలకు ఆహారధాన్యాలను సరఫరా చేసే సత్తా ఉందని చెప్పాడంటే దానికి కారణం మన రైతులు.. అంకితభావంతో పనిచేస్తున్న మీ అందరిని సత్కరించడం ఆనందంగా ఉంది. నేను కూడా కౌలు రైతునే. రాజమండ్రి దగ్గర ధర్మవరం ప్రాంతంలో గో అధారిత ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాను. కాబట్టి ఈ సభలో మాట్లాడే అర్హత కూడా నాకు ఉంది. నేను నా టీం ద్వారా వ్యవసాయం కోసం సుమారుగా ఐదు గ్రామాల్లో డ్రోన్ టెక్నాలజీ ఉపయోగిస్తున్నాం. యాజిలి దగ్గర 850 రైతులతో ఒక గ్రూపు ఏర్పాటు చేశాం. దాని టర్నోవర్ 30 కోట్లు. బాపట్ల దగ్గర ఆకుతోట గ్రామంలో 360 దేశీ వరి విత్తనాల దేశీ బ్యాంకు ఒకటి ప్రారంభించాం. చాలా పాఠశాలలో పొలంబడి పిల్లలకు వ్యవసాయం పట్ల ఆసక్తి చేపట్టుతున్నాం. ఏరువాక పౌర్ణమి విస్తృతంగా చేస్తున్నాం. స్వతంత్ర్యం దినోత్సవ రోజు రైతులతో జెండా ఎగరవేస్తున్నాం. రైతు యొక్క స్థానం పెరగాలి. రైతు ఏం చేస్తున్నడనేది ప్రజలకు తెలియాలి. ముఖ్యంగా విద్యార్థులకు వ్యవసాయం గురించి తెలియాలి. రైతు ఉజ్వల్ పాడిపంట గురించి, రైతు రాఘవ రెడ్డి ఖర్చు తగ్గించాలి, వ్యవసాయం చాలా ముఖ్యమని, రైతు నర్సిరెడ్డి సొసైటి ఏర్పాటు గురించి, రైతు పద్మ ఆవు లేనిదే వ్యవసాయం లేదని, రైతు బాపురెడ్డి భగవద్గీత నుంచి సాత్విక ఆహారం విధానం గురించి, రైతు రాజేందర్ రెడ్డి గారు రైతు సంఘాల ప్రాముఖ్యత గురించి, రైతు మరాటి శ్రీను పాలకేంద్రం, సంఘాల గురించి, రైతు అన్వర్ మేకల గురించి వ్యవసాయాన్ని ఏలా లాభసాటిగా చెప్పాలని వివరించారు. మహాత్మాగాంధీ మేక పాలు, పల్లీలు తినేవారు. ప్రస్తుత సమాజంలో కాలేజీ విద్యార్థులను, పాఠశాల విద్యార్థులకు పంట పోలాల్లోకి తీసుకెళ్లి వ్యవసాయంపై ఆసక్తి పెంపొందించాలి. ఈ మధ్య విద్యార్థులు బియ్యం ఎక్కడ దొరుకుతున్నాయంటే డిపార్ట్ మెంట్ స్టోర్ అంటున్నారు. పాలు ఎక్కడ దొరుకుతున్నాయంటే పాల కేంద్రాలు వైపు చూపెడుతున్నారు. వ్యవసాయంలో యువతరం ఏలా రావాలి, వ్యవసాయాన్ని ఏలా లాభసాటిగా మార్చాలి అని మనందరం ఆలోచించాలి. యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ఫౌండర్ రాజేంద్రకు ఒక టార్గెట్ ఇస్తున్నాను. ఇక్కడికి వచ్చిన రైతులందరి దగ్గర నుంచి మీరు కనుక ఈ రాష్ట్రానికి వ్యవసాయ శాఖ మంత్రి ఐతే ఏం చేస్తారనే దానిపై ఒక నాలుగైదు పాయింట్లు రాసి పంపండి. వాటి అన్నింటిని సంకలనం చేసి ఒక రిపోర్టు ముఖ్యమంత్రికి ఇద్దాం. రైతు బాధ రైతుకు తెలుస్తోంది. అందుకు మీ వ్యవసాయ రంగంలో మీరు అద్భుతమైన అనుభవం ఉన్నవారు కాబట్టి మీ అలోచనలు తీసుకొని సిఎం దగ్గరికి వెళదాం, ఉన్న పథకాలు సరిపోతాయా లేదా, లేదంటే ఇంక ఏలాంటి పథకాలు కావాలి. యజమాని కన్న భూమి మీద నిలబడి వ్యవసాయం చేసే వారికే అన్ని పథకాలు రావాలి. ఒక సమగ్రమైన మార్పు కోసం మనమందరం పనిచేద్దాం. చక్కని వ్యవసాయం చేస్తూ, సమాజానికి మార్గదర్శకంగా పనిచేద్దాం. రైతులే నిజమైన భగవంతులుగా భావిస్తూ మిమ్ముల సత్కరించుకోవడం ఆనందంగా ఉంది.

**డా. వర్రె వెంకటేశ్వర్లు ఆర్టీఐ మాజీ చీఫ్ కమిషనర్**

ఒకప్పుడు ప్రాచీన కాలంలో అన్నం దొరకడమే కష్టంగా ఉండేది. ఎన్నో ఇబ్బందులు పడి ఇప్పుడు రైతులు దేశవ్యాప్తంగా సమాజానికి నాలుగు మెతుకులు అందిస్తున్నారు. రైతు అనేవాడు ప్రకృతికి, సమాజానికి అనుసంధానకర్త, ప్రకృతి సహకరిస్తేనే రైతు పంట పండిస్తాడు. రైతు పండిస్తేనే సమాజానికి అన్నం దొరుకుతుంది. ఈ మూడింటికి అవినాభావ సంబంధం ఉంది. ప్రకృతి సహకరించాలంటే సమాజంలో చెట్లు పెంచాలి. రైతులకు సహకారం అందించే వ్యవసాయ అధికారులను రైతులు మరిచిపోరు. అశోక్ కుమార్ రైతులకు స్పూర్తిగా ఉన్నారు. ఇప్పటి నుంచి నా భూమిని నేను సాగుచేస్తాను. మీ అందరిని తీసుకెళ్లి మీ సలహాలు, అనుభవాలు తీసుకుంటాను.

**రాజేంద్ర పల్నాటి, ఫౌండర్ యూత్ ఫర్ యాంటీ కరప్షన్**

యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ఆధ్వర్యంలో గత పన్నెండు సంవత్సరాల నుంచి ఎన్నో వినూత్న కార్యక్రమాలు చేస్తున్నాము. నిజాయితీగా పనిచేసే అధికారులను, నిజాయితీగా పనిచేసే నాయకులను, గ్రామాల అభివృద్ధి కొసం పనిచేసిన సర్పంచులను సత్కరించామని అన్నారు. అందులో భాగంగానే అన్నదాతలకు ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. రోజురోజుకు వ్యవసాయం తగ్గిపోతుందని, వ్యవసాయం చేసే రైతులు తగ్గిపోతున్నారని అందుకే రైతుకు భరోసాగా, వ్యవసాయానికి అండగా తాము ఉండపోతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ ఫర్ యాంటీ కరప్షన్ మీడియా ఇంచార్జ్ జి. జయరాం, జాతీయ కార్యవర్గసభ్యులు కొమటి రమేశ్ బాబు, మూడావత్ రమేశ్. మారియా అంతోని, డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని, లక్ష్మికళ, గీత, రాజు కానుగంటి, వరికుప్పల గంగాధర్, బత్తిని రాజేష్, జి హరిప్రకాష్, అంజుకర్, నాగేంద్ర, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



## సత్కారం పొందిన రైతులు వారి అనుభవాలు

**ఉజ్జ్వల్.. వెంకటరత్న పూర్, మెదక్ :** ఆడియో విజువల్ ఇంజనీర్, ఇప్పటికి ఆస్ట్రేలియా సిటిజన్, 2016నుంచి గో ఆధారిత వ్యవసాయం, ప్రాచీన పద్ధతులతో వ్యవసాయం చేస్తున్నారు. దేశంలోనే ఎక్కడ లేని 13 రకాల గోజాతులు ఉన్నాయి. మొత్తం 300 పైగా గోవులు ఉన్నాయి. మినుములు, పెసర్లు, అల్లం, ఉల్లిగడ్డ, టమాటాలు, నాలుగు రకాల గడ్డి పండిస్తారు. పాలు, నెయ్యి, పన్నెండు రకాల స్వీట్స్, 500లీటర్ల సప్లయి చేస్తారు. 35మందికి ఉపాధి కల్పిస్తున్నారు.

**బండ రాఘవరెడ్డి, మిర్యాలగూడ :** 50 సంవత్సరాల నుంచి వ్యవసాయం చేస్తున్నారు. వరి, గోధుమ, జోన్నలు, మినుములు, పెసర్లు, రాగులు, వరిలో కూడా మూడు, నాలుగు రకాలు.. నూతన టెక్నాలజీ వాడుకొని ఒక చదరపు మీటరుకు 50 మొక్కలు పెడుతున్నారు. తెలంగాణలో మొదటగా గోధుమ పంట పండించారు. గోధుమల వలన రాష్ట్రస్థాయిలో బహుమతి. మిగతా రైతులకు, యువకులకు అవగాహన కల్పించడం.. కూరగాయల సాగు కూడా ఆర్గానిక్ పద్ధతిలో పండిస్తారు.

**ఎన్. నర్సిరెడ్డి, కౌట్ల (బి) నిర్మల్ జిల్లా :** ఇంటర్ మీడియట్ వరకు చదువుకున్నారు. 20 సంవత్సరాల నుంచి వ్యవసాయం ప్రారంభించారు. ఇప్పటికి 34సంవత్సరాల నుంచి చేస్తున్నారు. పత్తి, మొక్కజొన్న, సోయాబిన్, పసుపు, వరి.. 20ఎకరాలలో పండిస్తున్నారు. వీరి తండ్రి గారు 6 ఎకరాలు ఇస్తే వ్యవసాయంతో సంపాదిస్తూ 20ఎకరాలు చేసుకున్నారు. 2003లో ఏర్పడిన రైతు ఉత్పత్తి సమాఖ్య అభివృద్ధి అధ్యక్షుడిగా ఉన్నారు. ఇందులో 82మంది రైతులు ఉన్నారు. రైతుకు సంబంధించిన ప్రతి అంశంపై చర్చిస్తారు. పేద రైతులకు లోన్లు ఇస్తారు.

**పద్మ, బోర్నపల్లి, జగిత్యాల :** హైదరాబాద్ సరోజినినాయుడు మహిళా డిగ్రీ కళాశాల ప్రొపెసర్, గత ఐదు సంవత్సరాల నుంచి, వ్యవసాయంపై యువతీ, యువకులకు అవగాహన కల్పిస్తున్నారు. కోతకు అమ్ముతున్న గెదేలను కోనుగోలు చేస్తూ వారిని పోషిస్తున్నారు. ఇప్పుడు 200 దేశీయ ఆవులు పోషణ చేస్తున్నారు.

**బాపురెడ్డి, జైనా, జగిత్యాల :** 2015 నుంచి వ్యవసాయం చేస్తున్నారు. మామిడి, వరి, 2015 అర్గానిక్ పంట, గోముత్రం, గో పేడ, వేపగింజల కషాయం ఎనిమిది ఎకరాలు పండిస్తున్నారు. రెండు రకాల వరి పండిస్తున్నారు.

**రాజేందర్ రెడ్డి, భూపాల్ నగర్, ములుగు :** పదవ తరగతి పూర్తికాగానే 2000 సంవత్సరం నుంచి వ్యవసాయం చేస్తున్నారు. అరటి, పెసర, మిర్చి, పామాయిల్, వరి, పసుపు, ప్రత్తి మొత్తం 20 ఎకరాలలో సాగు చేస్తున్నారు. మైక్రో ఇరిగేషన్, తప్పనిసరి. గ్రీన్ మ్యానువర్, చిల్డప్ అప్లికేషన్, వ్యవసాయం చేసే పంటల గట్టు మీద కలప చెట్ల నిర్మాణం.

**మరాటి శ్రీను, లంబాడి పల్లె, జగిత్యాల :** 30సంవత్సరాల నుంచి వ్యవసాయం చేస్తున్నారు. వరి, పసుపు, మక్క, కాటన్, కూరగాయలు కూడా పండ స్తారు. బర్లు, ఆవులు పాల ఉత్పత్తి.. మామిడ తోట ప్రధాన ఆదాయ వనరు.

**కె.వి. రామరాజు, హైదరాబాద్ :** ఎనిమిది ఎకరాలలో పామాయిల్ పంట పండిస్తూ, వ్యవసాయంతో యువతీ, యువకులకు అవగాహన కల్పిస్తారు.

**అన్వర్, భూత్‌పూర్, మహబూబ్‌నగర్ :** 2018 నుంచి మేకల పెంపకం చేస్తున్నారుల 10 రకాల మేకలు ఉన్నాయి. మామిడ తోట, జామతోట, కుటుంబం మొత్తం మేకల పెంపకం.

**చిన్న గంగారెడ్డి, అంకాపూర్, నిజామాబాద్ :** 35సంవత్సరాల నుంచి వ్యవసాయం చేస్తున్నారు. అన్ని రకాల కూరగాయలు, సజ్జలు, ఎర్రజోన్న, మక్కెలు, సేంద్రీయ వ్యవసాయం.

**సంతోష్‌రెడ్డి, రుస్సాపూర్, యాదాద్రి :** పదవ తరగతి పూర్తికాగానే 2010 నుంచి వ్యవసాయం చేస్తున్నారు.. 25 ఎకరాలలో వరి, పత్తి, కంది, కూరగాయలు టమాటా పండిస్తారు.

మిగతా రైతులు పంతంగి రాంబాబు (రంగారెడ్డి జిల్లా), కె. హనుమంతరావు (పటాన్‌చెర్వు), సిహెచ్. రవీందర్ (జగిత్యాల్), ఎడ్మల్ల మల్లారెడ్డి (లక్ష్మీపురం, జగిత్యాల్), రాంచంద్రారెడ్డి (రామడుగు, కరీంనగర్), చందా సుధాకర్ (కండ్లపల్లె, కరీంనగర్), సామ ఎల్లారెడ్డి (సిద్దిపేట), భాస్కర్ రెడ్డి (అంకాపూర్), మాధవరెడ్డి (హైదరాబాద్), రాజేశ్వర్ రావు ( కరీంనగర్) తదితరులను సన్మానించారు.

# సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

## ఉప్పల్ నియోజకవర్గ BRS పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి

**జయభేరి, ఉప్పల్ :**
తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా అని ఉప్పల్ నియోజకవర్గ BRS పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం హబ్సిగుడా డివిజన్ OU పరిధిలోని క్యాంపు 3, 4, 5 వాసులతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కాలనీలో నెలకొన్న సమస్యలు రోడ్డు, నీటి, కరెంట్ సమస్యలు తీర్చుతా అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో క్యాంప్ ల అద్యక్షులు శంకర్, కనక రాజు, బాబా, హాబ్సిగూడ డివిజన్ ప్రెసిడెంట్ Dr.BV చారి, సోమి రెడ్డి, పల్లె రాజ్ కుమార్, లక్ష్మి నారాయణ, మనోహర్, యాదగిరి, గోవర్దన్ తదితరులు పాల్గొన్నారు.







భవాని నగర్ లో శ్రీ వరసిద్ధి వినాయకుని దర్శించుకున్న ఉప్పల్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి.

- జయభేరి, ఉప్పల్



నాచారం భవాని నగర్ వీధి నెంబర్ ఐదు లో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని సందర్శించిన ఉప్పల్ నియోజకవర్గ BRS అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి.

- జయభేరి, ఉప్పల్

# విగ్నేశ్వరుణ్ణి దర్శించికొని ప్రత్యేక పూజలు

**జయభేరి, మేడిపల్లి :**
వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 2వ డివిజన్ పంచవటి కాలనీ లో ప్రతిష్టించిన విగ్నేశ్వరుణ్ణి మేయర్ జక్క వెంకట్ రెడ్డి, కార్పొరేటర్ సుభాష్ నాయక్ కుటుంబ సమేతంగా దర్శించికొని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీర్వాదాలు తీసుకొవడం జరిగింది. అన్నదానం కార్యక్రమం లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆకుల సత్యనారాయణ, రాజిరెడ్డి, పంచవటి కాలనీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, ముక్తేశ్వర్ రెడ్డి, రేగు శ్రీనివాస్, మురళి, పంచవటి యువత రాకేష్, సుమేష్, భాను ప్రకాష్, అజిత్ కుమార్, శివ, మనీ, ఈశ్వర్ రెడ్డి, యువత, కాలనీవాసులు పాల్గొన్నారు.






# పల్నాడు జిల్లా మిత్రా మహిళా అధ్యక్షురాలిగా మహాలక్ష్మి

**జయభేరి, పల్నాడు జిల్లా, పిడుగురాళ్ళ:**
ఆరోగ్యశ్రీ పథకం విభాగం పల్నాడు జిల్లా మిత్రా మహిళా అధ్యక్షురాలిగా పిడుగురాళ్ళ పట్టణానికి చెందిన ఏలూరి మహాలక్ష్మి ఎన్నికయ్యారు. ఆరోగ్యశ్రీ పథకం విభాగంలో పని చేస్తున్న ఆరోగ్య మిత్రాలు నూతనంగా మిత్రాల అసోసియేషన్ ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో పిడుగురాళ్ళ పట్టణానికి చెందిన ఏలూరి మహలక్ష్మిని పల్నాడు జిల్లా మహిళా అధ్యక్ష పదవి వరించింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలిగా ఎన్నికైన మహాలక్ష్మికి రాష్ట్ర దళిత, గిరిజన, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల అధ్యక్షుడు మాచర్ల బుజ్జి, ఎన్నికల అధికారి కాకాని అప్పారావు, ప్రెసిడెంట్ సాయిబాబు రాజు శుభాకాంక్షలు తెలిపారు. మహాలక్ష్మి మాట్లాడుతూ... తనపై నమ్మకంతో తనను జిల్లా మహిళా అధ్యక్షురాలిగా ఎన్నుకున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు. మిత్రాల సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు.

# గ్రహణం వీడిన చంద్రుడిలా చంద్రబాబు బయటకు వస్తారు

**జయభేరి, బాపట్ల :**
తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని ఈ అరాచక వైసిపి ప్రభుత్వం అక్రమంగా అరెస్ట్ చేసి జైల్లో పెట్టినందుకు నిరసనగా తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం ఆదేశానుసారం బాపట్ల తెలుగుదేశం పార్టీ ఇన్ ఛార్జ్ వేగేశన నరేంద్ర వర్మ ఆధ్వర్యంలో బాపట్ల తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సంఘీభావ నిరసన దీక్ష నందు ఆదివారం టీయన్ యస్ఎఫ్, తెలుగు యువత, తెలుగు న్యాయవాద విభాగం నాయకులు దీక్షకు కూర్చుని తమ సంఘీభావం తెలియజేయగా నరేంద్ర వర్మ ఆ దీక్షలో పాల్గొని వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడిన నరేంద్ర వర్మ... వైసీపీ ప్రభుత్వం కక్ష్యపూరితంగా చంద్రబాబు ని అరెస్ట్ చేసిన ఎప్పటికైనా న్యాయం గెలుస్తుందని అని మాకు నమ్మకం ఉంది. గ్రహణం వీడిన చంద్రుడిలా చంద్రబాబు నాయుడు అన్ని కేస్ ల నుండి బయటకు వస్తారు. చట్టం తన పని చేస్తోంది అని నీతి వ్యాఖ్యలు చెబుతున్న జగన్, విజయసాయిరెడ్డి లు నాడు వారు జైలు లో ఉన్నప్పుడు ఎందుకు ఆ కబుర్లు చెప్పకుండా అక్రమంగా అరెస్ట్ అని గొడవలు చేశారు. చంద్రబాబు నాయుడు చేసిన అభివృద్ధి, స్కిల్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ ఫలితాలు అనేవి కంటికి కనిపిస్తున్నాయి. దాని ద్వారా లబ్ది పొందిన యువత కళ్లెదుటే ఉన్నారు. కేవలం జగన్ రెడ్డి తనకు అంటుకున్న అవినీతి మరకలు అందరికి అంటించాలని 16 నెలలు తాను జైల్లో ఉన్నాడు అని, చంద్రబాబు నాయుడు ని కనీసం 16 రోజులు అయిన జైల్లో ఉంచాలనే దుర్మార్గపు ఆలోచనతో అధికారాన్ని అడ్డుపెట్టుకుని అక్రమంగా అరెస్ట్ చేశారు. చంద్రబాబు వల్ల లబ్ది పొందిన యువత ప్రక్క రాష్ట్రాల నుండి వస్తుంటే వారిని అడ్డుకోవడానికి సరిహద్దుల్లో వేల మంది పోలీసులను కాపలా పెట్టడం జగన్ రెడ్డి పిరికి మనస్తత్వనికి నిదర్శనం. రాష్ట్ర యువతకు ఐటీ ని పరిచయం చేసి లక్షల కుటుంబాల్లో వెలుగులు నింపిన మహోన్నత వ్యక్తి చంద్రబాబు, ఈ కష్టసమయంలో యువత అంతా వారి కుటుంబానికి అండగా నిలబడాలని నరేంద్ర వర్మ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ TNSF, తెలుగు యువత, బార్ అసోసియేషన్ లాయర్స్, జనసేనా పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.






# నెహ్రూ నగర్ సంక్షేమ సంఘం వాసుల ఏకగ్రీవ తీర్మానం

**జయభేరి, కాప్రా :**
చర్లపల్లి డివిజన్ నెహ్రూ నగర్ సంక్షేమ సంఘం వారు సైనిక్ పూరి లోని BRS పార్టీ కార్యాలయం కాలనీ లో తీర్మానం చేసి అందరూ కలిసి ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి కే మా మద్దతు అని ప్రకటించి ఏకగ్రీవ తీర్మాణ కాఫీని అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో ప్రజలకు అందుబాటులో ఉన్న నాయకుడు బండారి లక్ష్మారెడ్డి అని... అధిక మెజారిటీతో గెలిపించుకోవాలని అని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో BRS సీనియర్ నాయకుడు నేమూరి మహేష్ గౌడ్, నెహ్రూా నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బాదలి స్వామి ముదిరాజ్, ఉపాధ్యక్షుడు కనకయ్య, రాజేష్, శ్రీధర్, సురేష్, వేణు, కిషోర్ బాలేష్, రవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# విఘ్నేశ్వరుడికి.. విశేష పూజలు

**జయభేరి, ఉప్పల్ :**
చిల్కానగర్ డివిజన్లో వినాయక మండపాల వద్ద ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్న కార్పొరేటర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్. చిల్కానగర్ డివిజన్లోని కళ్యాణపురి, రాఘవేందర్ నగర్ కాలనీ, నార్త్ కళ్యాణ్పురి, సీతారామ కాలనీ, బాలాజీ ఎంక్లేవ్, సాయిరాం నగర్ కాలనీ, శ్రీనగర్ కాలనీ1 వెంకటేశ్వర కాలనీల, శ్రీనగర్ కాలనీ 2, బ్యాంక్ కాలనీ, అన్నపూర్ణ కాలనీ పలు కాలనీలా అసోసియేషన్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినటువంటి గణేష్ మండపాలని సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొని, అనంతరం అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్. కార్యక్రమంలో సీనియర్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, బజార్ జగన్నాథ గౌడ్, ఎద్దుల కొండల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కోకొండ జగన్, బింగి శ్రీనివాస్, రామానుజన్, గూడూరు రమేష్ గౌడ్, శీను నాయక్, బాలు, శ్యామ్, కాలనీల అధ్యక్ష కార్యదర్శులు మొదలగువారు పాల్గొన్నారు.





# గణపతి నవరాత్రి ఉత్సవాలలో ప్రత్యేక పూజలు

## పూజలో పాల్గొన్న కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి కుటుంబ సభ్యులు



**జయభేరి, మేడిపల్లి :**
వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మన 25వ డివిజన్ విహరిక కాలనీ అశోసియేషన్ వారి ఆధ్వర్యంలో ప్రతిష్టించిన గణపతి ఏడవ రోజు పూజ స్థానిక 25వ డివిజన్ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి కుటుంబ సభ్యులు గణనాధుని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. పూజ కార్యక్రమనికి ముఖ్యఅతిథిగా మేయర్ జక్క వెంకట్ రెడ్డి, బండారి రవిందర్ విచ్చేసి పూజలో పాల్గొన్నారు. అనంతరం కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంను కాలనీ వాసులతో కలిసి ప్రారంభించారు. ఈ పూజ కార్యక్రమంలో విహరిక కాలనీ కుటుంబ సభ్యులు, 25వ డివిజన్ కాలనీ వాసులు, పెద్దలు, మహిళలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి అన్నప్రసాధాలు స్వీకరించారు.





# మంత్రి తనయుడు భద్ర రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు

**జయభేరి, మేడిపల్లి :**
మంత్రి చామకూర మల్లారెడ్డి తనయుడు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర యువ నాయకులు, మల్లారెడ్డి హెల్త్ యూనివర్సిటీ చైర్మన్ Dr చామకూర భద్ర రెడ్డి జన్మదిన సందర్భంగా వారి నివాసములో బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ BRS పార్టీ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి బోడుప్పల్ BRS పార్టీ నాయకులు తాలూకా శత్రుజ్ఞ, K. పాండురంగ, R.శేఖర్ రాజు, G.కుమార్, M. స్వామి ఇల్లూరి శ్రీనివాస్ గుప్తా, ఉప్పరి విజయ్, మోతే రాజు, జక్కా ప్రవీణ్, మైసగల్ల శ్రీకాంత్, చినగళ్ల వినయ్ పాల్గొన్నారు.

# మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం చారిత్రక నిర్ణయం

**జయభేరి, మేడిపల్లి :**
బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ లో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి జ్ఞానమాల సమర్పించే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. ఈ ఆదివారంతో ఈ కార్యక్రమం 240 వారాలకు చేరుకోవడం జరిగింది. ఈ సందర్భంగా అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షులు నత్తి మైసయ్య పాల్గొని మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి ఆమోదింపజేసిన మహిళా రిజర్వేషన్ బిల్లు చారిత్రక నిర్ణయమని కొనియాడారు. కానీ రాజకీయ రంగంలో వచ్చే రిజర్వేషన్లు మరల అగ్రవర్ణ మహిళలు ఉపయోగించుకునే అవకాశం ఉందని దానివల్ల అందరూ మహిళలు రాజకీయ రంగంలో ఎదుగుదలకు అవకాశం ఉండదని తెలియజేశారు. కాబట్టి మహిళా రిజర్వేషన్ బిల్లులో జనాభా దామాషా ప్రకారం మహిళలకు రిజర్వేషన్ కల్పించినప్పుడు మాత్రమే ఆశించిన ఫలితాలు వస్తాయని, అప్పుడే ప్రభుత్వాలకు నిజమైన చిత్తశుద్ధి ఉన్నదని గుర్తిస్తామని తెలియజేశాడు. బాబా సాహెబ్ అంబేద్కర్ మహిళల హక్కుల కోసం అనేక రకాల పోరాటాలు చేశాడని హిందూ బిల్లుకోడ్ రూపొందించి అది ఆమోదం పొందని సందర్భంలో తన న్యాయ శాఖ మంత్రి కూడా రాజీనామా చేసి మహిళల పక్షపాతిగా నిలిచిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. కాబట్టి ప్రతి మహిళ బాబాసాహెబ్ అంబేద్కర్ గుర్తుంచుకోవాలని తెలియజేశాడు. ప్రతి రాజకీయ పార్టీ ఈ రాబోయే ఎన్నికల్లో మహిళలకు అత్యధిక సీట్లు కేటాయించి వారి నిబద్ధతను ప్రకటించుకోవాలని రాజకీయ పార్టీలకు హితువు పలికాడు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు బుగ్గ మైసయ్య, రాపోలు శ్రీరాములు, ఈతకోట గోపాలకృష్ణ, దేశపాక వినోద్ కుమార్, బండారి సాయి, నాసిక్ ప్రభాకర్, కంచి సతీష్, సవరపు బయన్న తదితరులు పాల్గొన్నారు.



# దారి దోపిడీ ఘటనలో ముగ్గురు హిజ్రాల అరెస్ట్

**జయభేరి, అమలాపురం :**
అమలాపురం పట్టణ శివారు సావరం బైపాస్ రోడ్ లో అంబాజీపేట మండలానికి చెందిన యువకుడిని దారి దోపిడీ చేసిన ముగ్గురు హిజ్రాలను అరెస్ట్ చేసినట్లు డి.ఎస్.పి అంబికా ప్రసాద్ తెలిపారు వారు తెలిపిన వివరాలు ప్రకారం గురువారం రాత్రి అటుగా వెళుతున్న యువకుడి ఆపి హిజ్రాలు కాసేపు కాలక్షేపం చేసి 500 రూపాయలు ఫోన్ పే చేయించుకున్నారు. ఆ తరువాత అతని మెడలోని బంగారు గొలుసు లాక్కుని పోతుండగా యువకుడు లాగేయడంతో కొంత ముక్క తెగిపోయింది. మిగిలిన గొలుసుతో ఆ ముగ్గురు ద్విచక్ర వాహనంపై పరారయ్యారు. దీనిపై పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు అందుకున్న సిఐ వీరబాబు ఆధ్వర్యంలో ఎస్సై జోషి కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. కాకినాడ వలస పాకల చెందిన రెల్లి రవి అలియాస్ స్వీటీ(20), రేచర్లపేట రాశులు ఏడిద రమేష్ అలియాస్ కీర్తి(21) గొల్లపల్లి రాజు అలియాస్ అమూల్య(23)లను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి ద్విచక్ర వాహనాన్ని 4.7గ్రాములు బంగారం చైన్ స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిని అమలాపురం కోర్టులో శనివారం హాజరపరిచి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించినట్లు తెలిపారు.

## గీతాంజలి ఈజ్ బ్యాక్

# గీతాంజలి మళ్లీ వచ్చింది

టాలీవుడ్ హిస్టరీలో అంజలి నటించిన `గీతాంజలి` సినిమాను అంత తేలిగ్గా ఎవరూ మర్చిపోలేరు. అద్భుతమైన విజయాన్ని సొంతం చేసుకున్న `గీతాంజలి` సినిమాకు సీక్వెల్ సిద్ధమైంది. ప్రతీకార జ్వాలతో మళ్లీ వచ్చేస్తోంది గీతాంజలి అంటూ `గీతాంజలి` సీక్వెల్ గురించి అనౌన్స్ చేశారు మేకర్స్. `గీతాంజలి మళ్లీ వచ్చింది` అనే పేరుతో సినిమాను తెరకెక్కిస్తున్నారు. వెన్నులో వణుకు తెప్పించే స్పైన్ చిల్లింగ్ ప్రాజెక్ట్ అంటూ థ్రిల్లింగ్ అనౌన్స్ మెంట్ ఇచ్చేశారు మేకర్స్. `గీతాంజలి మళ్లీ వచ్చింది` సినిమా షూటింగ్ ఇవాళ్టి నుంచి మొదలైంది. కోన వెంకట్ సగర్వంగా సమర్పిస్తున్న సినిమా `గీతాంజలి మళ్లీ వచ్చింది`. ఎంవీవీ సినిమా, కోన ఫిల్మ్ కార్పొరేషన్ సంస్థలు ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నాయి. అచ్చ తెలుగు అమ్మాయి అయినా ప్యాన్ ఇండియా రేంజ్‌లో మెప్పిస్తున్న అంజలి నటిస్తున్న 50వ సినిమా ఇది. ఎంవీవీ సత్యనారాయణ, జీవీ నిర్మిస్తున్నారు. ఓ పాడుబడ్డ బంగ్లా ప్రాంగణంలో అటుగా తిరిగి కూర్చుని ఉన్న అమ్మాయితో పోస్టర్ సినిమాపై ఆసక్తి కలిగిస్తూ, ఆకట్టుకుంటోంది. `గీతాంజలి మళ్లీ వచ్చింది` సినిమా ముహూర్తపు సన్నివేశానికి రామచంద్ర క్లాప్‌కొట్టారు. సినిమా స్క్రిప్ట్‌ని ఎంవీవీ సత్యనారాయణ, కోన వెంకట్ సంయుక్తంగా డైరక్టర్ శివ తుర్లపాటికి అందజేశారు. `గీతాంజలి మళ్లీ వచ్చింది` చిత్రంలో అంజలి, శ్రీనివాసరెడ్డి, సత్యం రాజేష్, సత్య, షకలక శంకర్, అలీ, బ్రహ్మాజీ, రవి శంకర్ (డబ్బింగ్ ఆర్టిస్ట్), రాహుల్ మాధవ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాకు కథ: కోన వెంకట్, స్క్రీన్ ప్లే: కోన వెంకట్, భాను భోగవరపు, మాటలు: భాను భోగవరపు, నందు శవరిగణ, దర్శకత్వం: శివ తుర్లపాటి, సంగీతం: ప్రవీణ్ లక్కరాజు, కెమెరా: సుజాత సిద్ధార్థ్, ఎడిటర్: చోటా కె ప్రసాద్, ఆర్ట్: నార్ని శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: నాగు వై, పీ ఆర్ ఓ: వంశీ కాక, పబ్లిసిటీ డిజైనర్: అనిల్ భాను.






# 'స్కంద' బుకింగ్స్ షురూ

స్కంద సినిమా కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఉస్తాద్ రామ్ పోతినేని హీరోగా నటించిన ఈ చిత్రానికి మాస్ యాక్షన్ డైరెక్టర్ బోయపాటి శ్రీను దర్శకత్వం వహించారు. బోయపాటి మార్క్ మూవీగానే హెవీ యాక్షన్ సీన్లతో, ఫ్యామిలీ సెంటిమెంట్‌తో స్కంద ఉండనుందని ట్రైలర్ చూస్తేనే అర్థమైంది. ఈ చిత్రానికి ఎస్ థమన్ సంగీతం అందించారు. స్కంద చిత్రం మరో నాలుగు రోజుల్లో అంటే సెప్టెంబర్ 28వ తేదీన రిలీజ్ కానుంది. స్కంద సినిమా టికెట్ల ముందస్తు బుకింగ్స్ ఆన్‌లైన్‌లో నేడు (సెప్టెంబర్ 24) మొదలయ్యాయి. స్కంద సినిమాకు సంబంధించి చాలా థియేటర్లలో బుకింగ్‌కు టికెట్లు అందుబాటులోకి వచ్చాయి. ఈ విషయాన్ని చిత్ర యూనిట్ పేర్కొంది. ఇప్పటికే చాలా చోట్ల స్కంద మూవీ బుకింగ్స్ ఓపెన్ అయ్యాయి. ఇంకా కాని చోట్ల రేపటి కల్లా అందుబాటులోకి రానున్నాయి. స్కంద సినిమా సెప్టెంబర్ 28న తెలుగుతో పాటు హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లోనూ రిలీజ్ కానుంది. రామ్ పోతినేనికి ఇది తొలి పాన్ ఇండియా మూవీగా ఉంది. స్కంద సినిమాకు సంబంధించి గతంలోనే ఓ ట్రైలర్ వచ్చింది. యాక్షన్ సీక్వెన్సులు, డైలాగ్‌లతో ఆకట్టుకుంది. ఈ కొత్త ట్రైలర్ రిలీజ్ గురించి ఈ సినిమాను నిర్మిస్తున్న శ్రీనివాస సిల్వర్ స్క్రీన్స్ వెల్లడించింది. మరోవైపు, కరీంనగర్‌లోని వీ కన్వెన్షన్‌లో రేపు సాయంత్రం కల్ట్ జాతర పేరుతో స్కంద మూవీ ఈవెంట్ జరగనుంది. స్కంద చిత్రం నుంచి వచ్చిన గండరబాయ్, కల్ట్ మామ పాటలు ఆకట్టుకున్నాయి. గండరబాయ్ పాటలో హీరో రామ్, హీరోయిన్ శ్రీలీల డ్యాన్స్ అదిరిపోయింది. కల్ట్ మామ అనే స్పెషల్ సాంగ్‌లో ఊర్వశి రౌతేలా చిందేశారు. స్కంద సినిమాలో సాయీ మంజ్రేకర్, ప్రిన్స్ సెసిల్, శరత్ లోహితశ్వ, శ్రీకాంత్ కీలకపాత్రలు పోషించారు. శ్రీనివాస సిల్వర్ స్క్రీన్స్ పతాకంపై జీ స్టూడియోస్ భాగస్వామ్యంతో ఈ చిత్రాన్ని నిర్మించారు శ్రీనివాస చిట్టూరి. సెప్టెంబర్ 15వ తేదీన రిలీజ్ కావాల్సిన స్కంద సినిమా అనంతరం సెప్టెంబర్ 28వ తేదీకి వాయిదా పడింది.

# జవాన్ డైరెక్టర్ అట్లీపై నయనతార ఫైర్

సౌత్ లేడి సూపర్ స్టార్ నయనతార ఇటీవల జవాన్ మూవీతో బాలీవుడ్ ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది. అయితే జవాన్ సినిమా దర్శకుడు అట్లీపై నయనతార అసంతృప్తిగా ఉందంటూ వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. బాలీవుడ్ బాద్ షా, కింగ్ ఖాన్ షారుక్ ఖాన్, సౌత్ బ్యూటిఫుల్ లేడి సూపర్ స్టార్ నయనతార తొలిసారిగా కలిసి నటించిన చిత్రం జవాన్. షారుక్ ఖాన్ డ్యుయెల్ రోల్ పోషించిన ఈ సినిమాకు ప్రముఖ తమిళ డైరెక్టర్ అట్లీ దర్శకత్వం వహించిన విషయం తెలిసిందే. ఈ సినిమాతో అటు అట్లీ.. ఇటు నయనతార ఇద్దరూ బాలీవుడ్‌కు పరిచయం అయ్యారు. అంతేకాకుండా తొలి సినిమాతోనే హిందీలో సాలిడ్ బ్లాక్ బస్టర్ హిట్ కొట్టారు. ఇప్పటికే ఈ మూవీ వందల కోట్ల గ్రాస్ కలెక్షన్స్ రాబట్టి పలు రికార్డులు క్రియేట్ చేసింది. జవాన్ సినిమాలో నయనతార, షారుక్ ఖాన్‌తోపాటు బాలీవుడ్ హాట్ బ్యూటి దీపికా పదుకొణె, మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి, ప్రియమణి, సాన్య మల్హోత్రా, రిధి డోగ్రా, బిగ్ బాస్ సిరి హన్మంతు, యోగిబాబు, సంజయ్ దత్, సునీల్ గ్రోవర్ కీలక పాత్రలు పోషించారు. అయితే ఇందులో విలన్‌గా విజయ్ సేతుపతి చేయగా.. మరో హీరోయిన్‌గా దీపికా పదుకొణె మెరిసింది. తండ్రి పాత్రలో ఉన్న షారుక్ ఖాన్‌కు భార్యగా దీపికా నటించింది. జవాన్ సెకండాఫ్‌లో వచ్చే దీపిక పాత్ర ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అయింది. ఇక నయనతార రోల్ కూడా స్టైలిష్‌గా, పవర్‌ఫుల్‌గా ఉంది. కానీ, తన కన్నా దీపికాకే ఎక్కువ పేరు వచ్చిందని, తన పాత్రను తక్కువ చేసి అట్లీ చూపించడాని నయనతార చాలా కోపంగా, అసంతృప్తితో ఉందని ఇటీవల తమిళ మీడియాలో తెగ వార్తు వచ్చాయి. యూట్యూబ్ ఛానెళ్లు అయితే తమ క్రియేటివిటీ చూపించాయి. దీంతో అట్లీతో మరోసారి నయన్ సినిమా చేయదని కూడా రాసేశారు. తమిళ మీడియా, యూట్యూబ్ ఛానెళ్లలో వచ్చిన వార్తలపై తెగ సీరియస్ అయిందట నయనతార. వారిపై లీగల్ యాక్షన్ తీసుకోనుందట. అట్లీపై తనకు కోపం ఉందని అసత్య వార్తలు, రాసిన, చూపించినా వారందరిపైనా నయనతార పరువు నష్టం దావా వేయనున్నట్లు టాక్ వస్తోంది. అంతేకాకుండా అట్లీ పుట్టినరోజు సందర్భంగా బర్త్ డే విషెస్ తెలియజేస్తూ తనను చూసి గర్వంగా ఫీల్ అవుతున్నా అంటూ ఇన్ స్టాలో స్టోరీ పెట్టింది. దీంతో నయన్, అట్లీ మధ్య ఎలాంటి మనస్పర్థలు లేవని క్లారిటీ ఇచ్చింది.



# ఖుషి ఓటీటీ రిలీజ్ డేట్ ఫిక్స్

ఖుషి సినిమా ఓటీటీలోకి వచ్చేస్తోంది. ఈ సినిమా స్ట్రీమింగ్ డేట్, ప్లాట్‌ఫామ్ ఖరారైంది. రౌడీ హీరో విజయ్ దేవరకొండ, స్టార్ హీరోయిన్ సమంత హీరోహీరోయిన్లుగా నటించిన ఖుషి సినిమా ఓటీటీ స్ట్రీమింగ్ డేట్ ఖరారైంది. శివ నిర్వాణ దర్శకత్వం వహించిన ఈ సినిమా.. సెప్టెంబర్ 1వ తేదీన థియేటర్లలో రిలీజ్ అయింది. లవ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఖుషి మూవీకి మిశ్రమ స్పందన వచ్చింది. విజయ్, సమంత నటనకు ప్రశంసలు దక్కాయి. పాటలు కూడా ఈ సినిమాకు పెద్ద ప్లస్ అయ్యాయి. ఇప్పుడు ఖుషి సినిమా ఓటీటీలోకి వచ్చేందుకు రెడీ అయింది. ఈ మూవీ ఓటీటీ స్ట్రీమింగ్ డేట్ ఖరారైంది. థియేటర్లలో రిలీజ్ అయిన సరిగ్గా నెలకు ఓటీటీలోకి ఈ మూవీ వస్తోంది. అక్టోబర్ 1వ తేదీన నుంచి 'నెట్‌ఫ్లిక్స్'లో తెలుగుతో పాటు హిందీ, తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో ఖుషి చిత్రం స్ట్రీమింగ్ కానుంది. ఈ విషయాన్ని నెట్‌ఫ్లిక్స్ నేడు అధికారికంగా ప్రకటించింది. ఖుషి సినిమాలో బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి విప్లవ్ పాత్రలో మెప్పించారు విజయ్ దేవరకొండ. సాఫ్ట్ వేర్ ఇంజినీర్ ఆరాధ్య క్యారెక్టర్ చేశారు సమంత. వీరిద్దరూ కశ్మీర్‌లో ప్రేమలో పడతారు. ఆ తర్వాత సిద్ధాంతాల వైరుధ్యంతో ఇరు కుటుంబాల పెద్దలు అంగీకరించకపోవటంతో బయటికి వెళ్లి పెళ్లి చేసుకుంటారు విప్లవ్, ఆరాధ్య. ఆ తర్వాత విప్లవ్, ఆరాధ్య మధ్య గొడవలు జరిగి విడిపోయే వరకు పరిస్థితి వెళుతుంది. మరి, వీరిద్దరూ మళ్లీ ఎలా కలిశారన్నదే ఖుషి సినిమా ప్రధానమైన కథగా ఉంది. ఖుషి సినిమాకు శివ నిర్వాణ దర్శకత్వం వహించగా.. హేషమ్ అబ్దుల్ వాహబ్ సంగీతం అందించారు. ఈ మూవీ పాటలు సూపర్ హిట్ అయ్యాయి. సినిమాకు మంచి క్రేజ్ తెచ్చిపెట్టాయి. ఈ చిత్రానికి మ్యూజిక్ పెద్ద ప్లస్ అయింది. కథలో డెప్త్ లేకపోవటం వల్ల ఖుషి మూవీ ఆశించిన స్థాయిలో విజయం సాధించలేదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఖుషి చిత్రంలో జయరాం, సచిన్ ఖేడకర్, మురళీశర్మ, లక్ష్మి, అలీ, రోహిణి, వెన్నెల కిశోర్, రాహుల్ రామకృష్ణ కీలకపాత్రలు పోషించారు. మైత్రీ మూవీ మేకర్స్ ఈ సినిమాను నిర్మించింది.



Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Publishedat # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com